# మెగా జాబ్‌మేళాకు 10 వేల మంది..

## ఉద్యోగార్థులతో జాతరను తలపించిన మడికొండ ఐటీ పార్క్

- పాల్గొన్న 36 కంపెనీలు.. సుమారు 1500 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు
- త్వరలో మరిన్ని నిర్వహిస్తాం : క్వాడ్రంట్ సీఈవో వంశీరెడ్డి
- హాజరైన ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి




ఉద్యోగార్థులతో క్వాడ్రంట్ కంపెనీ వద్ద కోలాహలం


క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న ఉద్యోగార్థులు

మడికొండలోని ఐటీ పార్క్‌లో క్వాడ్రంట్ ఐటీ సొల్యూషన్స్ కంపెనీలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ మేళాలో 36 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. సుమారు 1500 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో టెక్ మహీంద్ర 200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది. 2021 నుంచి 2024 వరకు బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీల్లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులను మాత్రమే ఎంపిక చేశారు. కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్వాడ్రంట్ ఐటీ కంపెనీ సీఈవో వంశీరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ కష్టపడి చదివి ఐటీ సంస్థలు స్థాపించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి రెండు లక్షల ఉద్యోగాలకు జాబ్ కార్డ్స్, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మరిన్ని ఐటీ కంపెనీలకు ప్రభుత్వ స్థలం కేటాయించనున్నదని, ఎల్లప్పడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లోనే కాకుండా వరంగల్‌లోనూ ఐటీ కంపెనీలు జాబ్స్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సీఈవో కంచరకుంట్ల వంశీరెడ్డి మాట్లాడుతూ మెగా జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చిందన్నారు. వివిధ జిల్లాల నుంచి ఆన్‌లైన్ ద్వారా 15,895 దరఖాస్తు చేసుకోగా 6800 మందిని ఇంటర్వ్యూలకు పిలిచినట్లు చెప్పారు. అన్ని కంపెనీల్లో కలిపి 1200 నుంచి 1600 వరకు ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అయితే సుమారు పది వేల వరకు అభ్యర్థులు హాజరయ్యారని, త్వరలోనే మరిన్ని కంపెనీలతో మాట్లాడి జాబ్ మేళా నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్వాడ్రంట్ సంస్థ ఎండీ కంచరకుంట్ల మురళీధర్‌రెడ్డి, వివిధ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

- మడికొండ, డిసెంబర్ 18


మెగా జాబ్‌మేళాకు భారీగా తరలివచ్చిన యువతీయువకులు


మెగా జాబ్‌మేళాను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, క్వాడ్రంట్ సీఈఓ వంశీరెడ్డి, పాల్గొన్న ఉద్యోగార్థులు


యువతిని ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీ ప్రతినిధి



క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న యువతీయువకులు

# సిరులు కురిపిస్తున్న మిర్చి

- పచ్చి, పండు మిరపకాయలకు భలే గిరాకీ
- క్వింటాల్‌కు రూ.3వేలు పలుకుతున్న ధర
- దినసరి కూలీలకు చేతినిండా పని
- వాజేడు నుంచి వివిధ ప్రాంతాలకు పచ్చిమిర్చి ఎగుమతి

ప్రస్తుతం పచ్చి, పండు మిర్చికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో ఇటు పంట సాగు చేసిన రైతులకు సిరులు కురిపిస్తుండగా, కూలీలకూ చేతినిండా పనిదొరుకుతోంది. ఒకప్పడు పెట్టుబడికి ఇబ్బంది పడే పరిస్థితి ఉండగా ప్రస్తుతం ఆశించిన దిగుబడి వస్తుండడంతో ఇతర ప్రాంతాలకు సైతం ఎగుమతి అవుతోంది. క్వింటాల్‌కు రూ.3వేల ధర పలుకుతుండడంతో మిర్చి రైతుల్లో సంతోషం కనిపిస్తోంది.

- వాజేడు, డిసెంబర్ 18


వాజేడులో పచ్చిమిర్చి కోస్తున్న కూలీలు


కోసిన పచ్చిమిర్చిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ములుగు జిల్లా వాజేడు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఎక్కువగా మిర్చి సాగుచేశారు. ఇందులో 341, ఇండికా, వండర్‌హాట్ తదితర రకాల పచ్చిమిర్చి, పండు మిర్చి ఉన్నాయి. ఇందులో కాతకు వచ్చిన పచ్చి మిర్చి, పండు మిర్చికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. బయట మార్కెట్‌కు ఎగుమతులు చేస్తూ ఆశించిన లాభాలు గడిస్తున్నారు. మిర్చి సాగుకు ఎకరాకు రూ.2లక్షలపైనే ఖర్చు అవుతుండగా గతంలో రైతులు పెట్టుబడులకు ఇబ్బంది పడేవారు. కానీ ఇప్పుడు మిర్చి పంట వేసిన మూడు నెలల్లో పచ్చి మిర్చి కోతకు సిద్ధంగా ఉండడంతో రైతులు కూలీల సహాయంతో పచ్చి మిర్చిని కోయించి వాటిని ప్రత్యేకంగా గ్రేడింగ్ చేయించి తూకం వేసి సంచుల్లో నింపి అమ్ముతున్నారు. క్వింటా పచ్చి మిర్చికి మార్కెట్‌లో రూ.2800, పండు మిర్చి రూ.3వేల వరకు ధర పలుకుతోంది. దీంతో చిన్న, సన్నకారు రైతులు పచ్చిమిర్చిని చేను వద్దకు వచ్చే వ్యాపారులకు విక్రయించి పంటను సాగుచేసుకుంటున్నారు. దీని వల్ల తమకు బయట పెట్టుబడి తెచ్చే బాధ కొంత మేర తగ్గిందని చెబుతున్నారు. అమ్మిన మిర్చి డబ్బులతో పంటకు పెట్టుబడి సొంతంగా పెట్టుకుంటున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఏదేమైనా పచ్చి మిర్చి, పండు మిర్చి అమ్మకాల వల్ల రైతులకు చేతికి నగదు అందుతుండడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మిర్చి సాగుచేస్తున్న రైతుల వద్దకు బయట నుంచి వ్యాపారులు వచ్చి మిర్చి కొనుగోలు చేసి హైదరాబాద్, వరంగల్, నర్సంపేటతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పచ్చి, పండు మిర్చికోతలు కోసే కూలీలకు సైతం చేతినిండా పని దొరుకుతుండడంతో వారు సైతం సంతోషం వ్యక్తంచేస్తున్నారు.


బస్తాల్లో నింపి కుట్టిపెట్టిన, పచ్చిమిర్చి, పండు మిర్చి

### లాభసాటిగా ఉంది..



పచ్చి, పండు మిర్చి అమ్మడం వల్ల కొంత మేర పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. పచ్చిమిర్చి అమ్మడం మాకు లాభసాటిగా ఉంది. లావుగా కాసిన పచ్చిమిర్చికి మార్కెట్‌లో ధర బాగానే పలుకుతోంది. పచ్చి మిర్చి, పండు మిర్చి అమ్మకాల వల్ల మాతో పాటు కూలీలకు సైతం చేతినిండా పనిదొరుకుతోంది.

- దాట్ల కిషోర్, రైతు

### చేతినిండా పని ఉంటాంది..



పచ్చిమిర్చి కోతల వల్ల మాకు చేతి నిండా పనిదొరుకుతాంది. రోజు కూలీ రూ.300 వరకు వస్తున్నయి. వరి కోతలు అయిపోయిన తర్వాత మాకు పచ్చిమిర్చి కోతలు మొదలవుతున్నయి. దీని వల్ల ఆడుతూపాడుతూ పనులకు పోతున్నం.

- సోమిడి సాయికిరణ్, దినసరి కూలీ, జగన్నాథపురం

# మ్యూజికల్ గార్డెన్‌కు పూర్వ వైభవం

- తుది దశకు పునరుద్ధరణ పనులు
- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు

వరంగల్‌లోని కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పునరుద్ధరణ పనుల్లో వేగం పుంజుకుంది. దాదాపు 90శాతం పూర్తవడంతో త్వరలో ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. రూ.కోటీ 60 లక్షల కుడా నిధులతో గార్డెన్ పనులు చేపట్టగా పూర్వవైభవం సంతరించుకొని చూడ చక్కని అందాలతో ఆకట్టుకోనున్నది.

- వరంగల్, డిసెంబర్ 18


గార్డెన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి

1996లో అప్పటి కమిషనర్ శాలినీమిశ్రా ప్రత్యేక శ్రద్ధతో నిర్మించిన మ్యూజికల్ గార్డెన్‌ను కొన్నేళ్లు బాగానే నిర్వహించారు. నగర ప్రజలు ఆహ్లాదం కోసం పెద్ద సంఖ్యలో గార్డెన్‌కు వచ్చేవారు. క్రమంగా నిర్వహణ సరిగా లేకపోవడంతో ఆదరణ తగ్గిపోయింది. దీంతో రెండు సంవత్సరాలుగా మ్యూజికల్ గార్డెన్‌ను మూసివేశారు. ఏడాది కిత్రం కుడా నిధులతో గార్డెన్ పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. అప్పటినుంచి నత్తనడకన సాగిన పనుల్లో ఇప్పుడు వేగం పెంచారు. త్వరలోనే మళ్లీ మ్యూజికల్ గార్డెన్‌ను ప్రారంభించి పూర్వవైభవం తీసుకొచ్చేలా అధికారులు కార్యాచరణ చేస్తున్నారు.


గార్డెన్‌లో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు


మ్యూజికల్ గార్డెన్ మధ్యలో ఏర్పాటు చేసిన అందమైన గ్రీనరీ

### తుది దశకు అభివృద్ధి పనులు

కాకతీయ మ్యూజికల్ గార్డెన్ అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయి. మ్యూజికల్ గార్డెన్‌లో ముందుబాగంలో గ్రీనరీ పనులు దాదాపుగా పూర్తిచేశారు. చిన్నారుల కోసం ఆట వస్తువులను ఏర్పాటుచేశారు. ఫుట్‌పాత్‌లను టైల్స్‌తో అందంగా తీర్చిదిద్దారు. మ్యూజికల్ గార్డెన్‌లోని రెండు బ్రిడ్జిలను అందంగా ముస్తాబు చేశారు. గతంలో బ్రిడ్జిలకు పైకప్పు ఉండేది కాదు. పునరుద్ధరణలో భాగంగా ఇప్పుడు బ్రిడ్జిలకు పైకప్పులతో పాటు గ్రానైట్ టైల్స్ వేశారు. దీంతో బ్రిడ్జిలు అందంగా కనిపిస్తున్నాయి.

### రెండు మ్యూజికల్ ఫౌంటేన్ల ఏర్పాటు

కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌లో రెండు మ్యూజికల్ ఫౌంటేన్‌లను ఏర్పాటు చేయనున్నారు. గార్డెన్‌కు వచ్చే సందర్శకులకు వీనుల విందైన సంగీతానికి అనుగుణంగా నాట్యం చేసే ఫౌంటేన్లను ఏర్పాటు చేయనున్నారు. గార్డెన్ వెనుకబాగంలో ఒక ఫౌంటేన్, మధ్యలో ఒక ఫౌంటేన్ ఏర్పాటుచేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ఫౌంటేన్‌లకు సంబంధించిన సంస్థలు కోటేషన్‌లు అందజేశాయని తెలిపారు. ఇటీవల మ్యూజికల్ గార్డెన్‌లో పురోగతి పనులను కుడా ఈఈ భీమ్‌రావు, హార్టికల్చర్ అధికారి వేణుగోపాల్, ఏఈ సిద్దార్థనాయక్‌లు పరిశీలించారు. గార్డెన్‌లో మరికొన్ని సౌకర్యాలు కల్పిస్తే వంద శాతం పనులు పూర్తి అయినట్టేనని అధికారులు చెబుతున్నారు. గార్డెన్‌లో మిరుమిట్లు గొలిపే రంగురంగుల విద్యుత్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.